క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అబ్దుల్లాపూర్, బాటసింగారం ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి మ. ధ్యాహ్నం 2గంటల వరకు అబ్దుల్లాపూర్‌మెట్ టౌన్, ఓఆర్ఆర్, మైత్రిగోకులం, అబ్దుల్లాపూర్ గ్రామం, కవాడిపల్లి, బలిజగూడ, ఇనాంగూడ, జాఫర్‌గూడ, కార్తీక్‌హోమ్స్, యశోదానగర్, ఢిల్లీపబ్లిక్ స్కూల్, నోవా కాలేజ్, కనకదుర్గా నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మంచాల: గవర్నర్ తమిళిసైపై ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మంచాల మండల పరిధిలోని లోయపల్లిలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. మహిళా గవర్నర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రాజు, శ్రీశైలం, వెంకటేశ్, యాదయ్య, శేఖర్, సర్పంచ్ అనిత, వైస్ ఎంపీపీ రాజేశ్వరి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆమనగల్లు: వేరుశనగ పంటలో పచ్చపురుగు, లద్దె పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను శనివారం ఆమె పరిశీలించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వ్యవసాయాధికారి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, రైతులు భాస్కర్‌రావు, నర్సింహారావు, రామయ్య, జంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈటెలకు ఘన స్వాగతం

ఆమనగల్లు: పట్టణంలో శనివారం ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌కు బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. నల్గొండ జిల్లా డిండిలో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్తున్న ఈటెలకు ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయనో అవినీతి పరుడు

మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: దేశంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అంత అవినీతి పరుడు ఇంకెవరు లేరని భువనగిరి మాజీ ఎంపీ, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని సాహేబ్‌గూడలో బీజేపీ పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అత్యంత అవినీతి పరుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని, 1200 మంది విద్యార్థులు ప్రాణాలు అర్పిస్తే.. తెలంగాణ వచ్చిందని, అలా వచ్చిన రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుందని విమర్శించారు. రూ.16 లక్షల కోట్ల బడ్జెట్ 8 సంవత్సరాల్లో ఎటు పోయిందని ప్రశ్నించారు. ఊరూరా బెల్టు షాపులు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, మద్యం ద్వారా వచ్చిన లాభాల్లో కొంతమేర సంక్షేమ పథకాలకు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. బెల్టు షాపులపై పోరాటానికి సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఇబ్రహీంపట్నంలో కమలం జెండా ఎగరడం ఖాయమన్నారు. అంతకు ముందు బూర సమక్షంలో పలువురు మహిళలు, యువకులు వివిధ పార్టీల నుంచి భాజపాలో చేరారు. వారికి ఆయన శాలువలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టి రాములు, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు దండిగ తిరుమలేశ్, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ అశోక్‌గౌడ్, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ నారాయణ యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, మనోహర్‌లాల్, గుండ్ల ధనుంజయ్యగౌడ్, గణేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అలసత్వం వద్దు

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి పనులను అలసత్వం చేయొద్దని ఎంపీడీఓ జయరాం విజయ్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను పూర్తి చేయాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున నర్సరీలను సంరక్షించాలని కోరారు. గ్రామాల్లో రోడ్లపై చెత్తచెదారం లేకుండా, మురికి నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ లక్‌పతి, 14 గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేయాలి

ఇబ్రహీంపట్నం: నాణ్యతతో కూడిన పనులను చేయాలని మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 3వ వార్డులో నిర్మిస్తున్న అంబేడ్కర్ హాల్ భవన స్లాబ్ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో రాజీపడకుండా నాణ్యతతో నిర్మించాలని తెలిపారు.

అవిశ్వాస పర్వం

- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో రాజకీయ వేడి
- అవిశ్వాస తీర్మానాలకు పట్టుబడుతున్న సభ్యులు
- అధికారులకు ఫిర్యాదులు

ఇబ్రహీంపట్నం: మూడేళ్ల గడువు జనవరి 27తో ముగియడంతో మున్సిపల్ చైర్మన్లు, చైర్‌పర్సన్‌లపై అవిశ్వాస తీర్మానాలకు తెరలేచింది. చైర్మన్లపై అవిశ్వాసం పెట్టే గడువు మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన గవర్నర్ ఈ ఆదేశాలను ఆమోదించకపోవడంతో గెజిట్ విడుదల కాలేదు. దీంతో మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లకు అవకాశం చిక్కింది. దీంతో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై, పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణలపై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదులు చేశారు.

ఈ చైర్‌పర్సన్ మాకొద్దు..

ఇబ్రహీంపట్నం చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి పాలన అవినీతిమయంగా మారిందని, అభివృద్ధిలో మున్సిపాలిటీ పూర్తిగా వెనుకబడిపోయిందని వెంటనే ఈ పదవి నుంచి ఆమెను తొలగించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌కు శనివారం వైస్ చైర్మన్ యాదగిరితో పాటు 20 మంది కౌన్సిలర్లు ఫిర్యాదులు చేశారు. అధికార పార్టీకి చెందిన కప్పరి స్రవంతి అవినీతి, అక్రమాలకు పాల్పడుతుందని వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని అధికార బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లే సుమారు సంవత్సర కాలంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులు సస్పెండ్ చేయకపోవడంతో ఆమెపై అవిశ్వాసం పెట్టి పదవి నుంచి దించేయాలని కౌన్సిలర్లు నిర్ణయించారు. మున్సిపాలిటీలోని 24 మంది కౌన్సిలర్లకు గాను ఆరుగురు కాంగ్రెస్, ఇద్దరు బీజేపీ సభ్యులుండగా మిగతా వారంతా బీఆర్ఎస్ కౌన్సిలర్లే. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆకుల మమత, ఈర్లపల్లి సునీత, బీఆర్ఎస్‌కు చెందిన నీలం శ్వేత మినహా మిగతా వారంతా చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్ఓ హరిప్రియకు, ఆర్డీఓ వెంకటాచారికి, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌కు ఈ మేరకు లిఖితపూర్వకంగా కౌన్సిలర్లు ఫిర్యాదులు చేశారు. చైర్‌పర్సన్ స్రవంతిపై అవిశ్వాసాన్ని పెట్టాలని ఫిర్యాదు అందినట్లు మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. సీడీఎంఏ తదితర ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసినట్లు ఆయన వెల్లడించారు.



ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

15 మంది ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణలపై అవిశ్వాస నోటీసు ప్రవేశపెట్టాలని కోరుతూ శనివారం పురపాలక సంఘానికి చెందిన 15 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్, పురపాలక సంఘం కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్యార శ్రీనివాస్, వడ్డేపల్లి విద్యావతి, పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, పండుగుల జయశ్రీ, చల్లూరి మురళీధర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్‌రెడ్డి, తొండెపు రోహిణి, పాశం అర్చన, మండలి కోటేశ్వరరావు, రమావత్ పరశురాం, చెవుల హరిశంకర్, సిద్ధంకి కృష్ణారెడ్డి, కందాడ అనుపమ ఉన్నారు. కాగా 15 మంది కౌన్సిలర్లలో అధికార టీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ సభ్యులకు తోడుగా ఇతరులు ముగ్గురు సభ్యులు కూడా ఉన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావును కలిసి ఉపాధ్యాయుల సమస్యలపై అర్జున్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల నుంచి ఉపాధ్యాయులను అక్రమంగా రంగారెడ్డి జిల్లాకు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నా ఇక్కడి ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నారని విమర్శించారు. జిల్లాకు బదిలీల్లో ప్రాముఖ్యత ఇవ్వడం లేదని, అక్రమ బదిలీలను వెంటనే నిలిపివేసి, జిల్లా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విద్యాధికారిని కోరారు. ఇప్పటికే 100 మంది ఉపాధ్యాయులను ఇతర జిల్లాల నుంచి దొడ్డి దారిన జిల్లాకు మార్చారని, అక్రమ బదిలీలపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

కనులపండువగా రథోత్సవం

తలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం తెల్లవారు జామున వివిధ రకాల పూలతో రథాన్ని అలంకరించారు. శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, పట్టు పీతాంబురాల వస్త్రాలను ధరింపజేసి వైభవంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా స్వామి వివేకానంద విగ్రహం వరకు రథాన్ని తీసుకువెళ్లారు. కన్నుల పండువగా కొనసాగిన కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఉపసర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమరాజు, నేతలు కృష్ణ, ప్రకాశ్, మల్లేశ్, యాదయ్య, శేఖర్, పాండు, శ్రీకాంత్, శ్రీశైలం, రవీందర్, నర్సింహ, తిరుపతి, కుమార్, దశరథం పాల్గొన్నారు.



తలకొండపల్లి: రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

శెట్టిపల్లి గ్రామంలో..

ఆమనగల్లు: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో శ్రీ అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ఆలయ అర్చకులు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలు ఉంచి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ జగన్, మండల టీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం, ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవం.. లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ప్రధాన కూడళ్ల మీదుగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సమకూర్చిన పట్టు పీతాంబురాల వస్త్రాలను భూదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సాహ విగ్రహాలకు ధరింపజేసి వైభవంగా కల్యాణం జరిపించారు. చెన్నకేశవస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగిపోయింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాలతో సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కిష్టమ్మ, గోపాల్‌నాయక్, లలిత, జ్యోతయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు యాదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, పర్వతాలు, వెంకట్‌రెడ్డి, కుమార్, కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: స్వామివారి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి, తదితరులు

హనుమాన్ దేవాలయంలో పూజలు

తలకొండపల్లి మండల పరిధిలోని బండలగడ్డ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం 41 రోజులు పూర్తయిన సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం వేకువ జామునే ఆలయంలో అభిషేకం, హారతికర్పూర నీరాజనం, అఖండదీపారాధన, యజ్ఞహోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, తదితర కీర్తనలు భక్తిశ్రద్ధలతో ఆలపిస్తూ ఆంజనేయ స్వామిని గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమానికి ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదములు అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో గల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవం, భక్తుల జయజయ ధ్వనుల మధ్య శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం వేదపండితులు వింజమూరు రామానుజన్ చార్యుల బృందం వేద మంత్రోచ్ఛరణల మధ్య వేడుకను వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తదితరులు హాజరై కల్యాణ వేడుకను తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, సర్పంచ్ సులోచన, ఎంపీటీసీలు మంజుల, గోపాల్, మార్కెట్ డైరెక్టర్ నర్సింహ, నాయకులు బాల్‌రాజ్, డాక్టర్ శ్రీనివాస్, రంగయ్య, సాయిలు, చెన్నయ్య, వెంకటేశ్, రాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను నిర్వాహకులు, స్థానిక నేతలు కలిసి ఎంపీపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంకు అందజేశారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని వారు తెలిపారు. ఉత్సవాలకు తప్పకుండా రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు లాయక్‌అలీ, నరేందర్‌రెడ్డి, కాముయ్య, వెంకటేశ్, శ్రీరాములు పాల్గొన్నారు.

కల్వకుర్తికి రూ.13.84 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎన్ఆర్ఈజీఎస్ క్రింద రూ.13.84 కోట్లు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెల్లడించారు. నియోజకవర్గానికి 37 బస్తీ, పల్లె దవాఖానాలు మంజూరయ్యాయని ఆయన వివరించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం సర్వ వికలాంగుల పునరావాస సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సమకూర్చిన ట్రైసైకిల్స్, దుప్పట్లు, నోట్ పుస్తకాలను ఆమనగల్లు ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, జెడ్పీటీసీ అనురాధలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం కలకొండవరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్లు, నుచ్చుగుట్టతండా వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కోటి రూపాయలు, వంపుగుడవద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని ఆయన వివరించారు. ఈజీఎస్ పథకం క్రింద రూ.13.84 కోట్లు మంజూరుకాగా ఇందులో 45 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున మంజూరైనట్లు ఆయన వివరించారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న 32 రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు. ఇందులోనే ముద్విన్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80 కోట్లు, రాంనుంతల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి 1.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమార్, సరిత, నిట్టె మంగమ్మ, టీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్య, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, సర్వ సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, అధ్యక్షురాలు మీనాక్షి, సిబ్బంది సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రైసైకిల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

ఆమనగల్లు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని కోరారు. మండలంలో కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి తీర్మానాలు చేయాలని, సమస్యలపై చర్చించాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల గురించి వివరించారు. పోలెపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎంపీటీసీ దోనాదుల కుమార్ ప్రశ్నించగా సబ్‌స్టేషన్‌లపై భారం పడకుండా సరఫరాను నిలిపివేస్తున్నామని, రైతులకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నామని ఏఈ సీతారాం చెప్పారు. కోనాపూర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు బిగించాలని సర్పంచ్ మల్లమ్మ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, సరిత, మంగమ్మ, సర్పంచ్‌లు బాల్‌రాం, లక్ష్మణ్, మల్లమ్మ, సోన శ్రీను నాయక్, వివిధ శాఖల అధికారులు కృష్ణయ్య, సక్కుబాయి, డా.పరీక్షిత్, డా.విజయ్‌కుమార్, అరుణకుమారి, సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో రక్త హీనత తగ్గించాలి

మంచాల: మహిళల్లో ఎక్కువ మంది రక్త హీనతకు గురవుతున్నారని మంచాల ఎంపీపీ నర్మద అన్నారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రక్త హీనతను తగ్గించడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. తల్లుల్లో రక్త హీనత తగ్గించడం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఆరోగ్యం పట్ల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించాలని, చాలా మందికి అవగాహన లేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. రక్తహీనత గల వారు ఐఎఫ్ఏ మందులు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్యశాల, అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలు, మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారానికి సంబంధించిన పట్టికను ఏర్పాటు చేయాలని చెప్పారు.

విద్యార్థి దశ ఎంతో విలువైంది

సామాజిక సమరసత తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్

యాచారం: విద్యార్థి దశ ఎంతో విలువైందని, పాఠశాల స్థాయిలోనే గొప్ప లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే వరకు ఇష్టంతో కష్టపడి చదవాలని సామాజిక సమరసత తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. విద్యార్థుల సంపూర్ణ వికాసం దృష్ట్యా శనివారం నందివనపర్తి గ్రామంలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయంలోని సంకల్ప భవన్‌లో పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు అంబేడ్కర్, అబ్దుల్‌కలాం, స్వామి వివేకానంద, శ్రీనివాస రామానుజన్‌లను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదవాలని అన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ లక్ష్యంతో చదివితే ప్రపంచాన్నే జయించే శక్తి యువత వద్ద ఉంటుందని అన్నారు. వ్యవస్థ కోసం వ్యక్తులు నిలబడాలని, వ్యవస్థ నిర్మాణం దేశానికి అవసరం ఉంటుందని తెలిపారు. దేశానికి గొప్ప సంపద విద్యార్థులేనని అన్నారు. ప్రతీ విద్యార్థి జ్ఞానం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అలవర్చుకోవాలని సూచించారు. శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం ఉన్నతంగా ఎదగడానికి మనకు ప్రపంచం కావాలి.. మనం ఎదిగిన తర్వాత ప్రపంచానికే మనం కావాలి అని అన్నారు. అందుకే ప్రపంచం మన కోసం ఎదురు చూసేలా మనం ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు దేవాలయంలో సరస్వతీ హోమం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సమన్వయ మండలి సభ్యులు రాఘవేంద్రశర్మ, జలంధర్, శివకుమార్, నిఖిల్, వెంకట్‌రెడ్డి, అంజయ్య, రామనాథం, మాతృమండలి సభ్యులు రుద్రమ్మ, దీపిక, రాణి తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డి కృషితోనే యాచారం అభివృద్ధి

బీఆర్ఎస్ నేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

యాచారం: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషితోనే యాచారం మండల కేంద్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ రాష్ట్ర నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. 7వ రోజు శనివారం మొండిగౌరెల్లి, యాచారం గ్రామాల్లో ప్రగతి నివేదన పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే కాకముందు యాచారం మండల కేంద్రంలో ఇరుకు రోడ్డు ఉండేదని, ఆయన కృషితోనే రూ. 20 కోట్లకు పైగా నిధులతో సాగర్‌రోడ్డు బొంగ్లూర్ గేట్ నుంచి మాల్ వరకు వెడల్పు జరిగిందని అన్నారు. యాచారం మండల కేంద్రంలో రోడ్డు వెడల్పుతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటైందని అన్నారు. పీహెచ్‌సీ అప్‌గ్రేడ్ జరిగి నేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మారిందని అన్నారు. త్వరలో రూ. 2 కోట్లకు పైగా నిధులతో నూతన ఆస్పత్రి భవనం నిర్మాణం అవుతుందని తెలిపారు. యాచారం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరనగర్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయం కాలనీ ప్రజలు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేతో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్, మొండిగౌరెల్లి సర్పంచ్ కృష్ణ, కొత్తపల్లి ఎంపీటీసీ సుమతమ్మ, మొండిగౌరెల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు కట్టెల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

ఇబ్రహీంపట్నం: ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ముందుకెళ్లాలని పీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా దండుమైలారం, రాయపోల్, ఇబ్రహీంపట్నంలోని బాలుర, బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదిగేందుకు పదో తరగతి తొలిమెట్టు లాంటిదన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చునన్నారు. అందుకు కసితో చదవాలన్నారు. పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాగాకు సురేశ్, ఝాన్సీ రాణి, సుచరిత పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన నిరంజన్‌రెడ్డి

కష్టపడి చదువుకోవాలి

మంచాల: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని పీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోయపల్లి, ఆరుట్ల గ్రామాల్లో పదో తరగతి విద్యార్థులకు ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పాండాల జంగయ్యగౌడ్, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కల్యాణ్ చక్రవర్తి, లోయపల్లి మాజీ సర్పంచ్ మోతీరాం నాయక్, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీపీ మధ్య వాగ్వాదం

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆమనగల్లు ఎంపీపీ అనితల మధ్య మరోసారి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురి మధ్య జరిగిన ఈ ఘటనలో బీఆర్ఎస్ నాయకుడు జోక్యం చేసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తనపై దాడి చేస్తారా అంటూ బీఆర్ఎస్ నాయకులపై ఎంపీపీ అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇదే సమయంలో కార్యాలయ ఆవరణలో సర్వ స్వచ్ఛంద సంస్థ వారు దివ్యాంగులకు ట్రై సైకిల్‌ల పంపిణీ ఏర్పాటు చేశారు. మండల సమావేశం అనంతరం సైకిల్‌ల పంపిణీ చేయాలని సంస్థ నిర్వాహకులకు ఎంపీపీ అనిత ముందుగానే సూచించారు. అయితే కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయంటూ ముందుగా దివ్యాంగులకు సైకిల్‌ల పంపిణీ కార్యక్రమానికి వెళ్లారు. ఎంపీపీ అనిత కార్యక్రమానికి రాకపోవడంతో సంస్థ నిర్వాహకులు ఎంపీపీని కార్యక్రమానికి ఆహ్వానించడానికి వెళ్లడంతో ఆమె నిరాకరించారు. కాగా మండల సమావేశం ప్రారంభించాలని ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్‌ను ఎంపీపీ అనిత పిలిపించగా ఎమ్మెల్యే వద్ద ఉన్న ఎంపీడీఓ రాలేదు. దీనితో ఆగ్రహంతో ఎంపీపీ అనిత కార్యక్రమం వద్దకు వచ్చి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే కార్యక్రమం తాను లేకుండా ఎలా చేస్తారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే అనుచరులు ఎంపీపీతో వాగ్వాదానికి దిగడంతో మహిళా ప్రజాప్రతినిధి అని అయిన తనకు గౌరవం ఇవ్వకుండా అవమానిస్తున్నారని, ఇష్టారీత్యా మాట్లాడుతున్నారని ఎంపీపీ ఆరోపించారు. అక్కడే ఉన్న సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్యలు వారికి సర్ది చెప్పకుండా చూస్తూ ఉండిపోయారు. చివరకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందరికీ నచ్చజెప్పి కార్యక్రమం నిర్వహించారు.



ఎమ్మెల్యేతో వాగ్వాదం చేస్తున్న ఎంపీపీ అనిత

రథోత్సవంలో అపశృతి

గాయపడిన బాలుడు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు రథాన్ని తాడుతో లాగుతుండగా మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ, అంజలి దంపతుల కుమారుడు సంపత్‌కుమార్ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో రథం అతని ఒక కాలు మీద నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయింది. మెరుగైన చికిత్స నిమిత్తం సంపత్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. సంపత్ కుమార్ చేవెళ్ల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు.